నవతెలంగాణ
1
మహబూబ్‌నగర్
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ ఇవ్వాలని..

కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ - మహబూబ్ నగర్

జిల్లాలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పేస్కేల్ ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్, సీఐటీయూ అనుబంధ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయికి ఫీల్డ్ అసిస్టెంట్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ,పేస్కేలు ఇవ్వాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అంతకుముందు అక్కడే ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్, జిల్లా కార్యదర్శి నల్ల వెల్లి కురుమూర్తి , సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 7వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లు 2006 నుంచి పనిచేస్తున్నారని, 18 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డులు కలిగిన ప్రతి పేదవారికి ఉపాధిహామీ పనులు అమలు చేయిస్తున్నారని విజ్ఞప్తి చేశారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన వీరి బతుకులు మారలేదని వాపోయారు, గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను నిర్లక్ష్యం చేసిందని, ఏ సమస్య పరిష్కారం చేయకుండా పైగా 4779 ద్వారా మాండేసు లెక్కించి పర్సంటేజ్ ప్రకారం జీతాలు ఇచ్చే పరిస్థితి తెచ్చిందని ఆరోపించారు. వేతనాలు తగ్గిపోయి 8700 నుంచి 11,500 మధ్య మాత్రమే వేతనాలు పొందుతున్నారని, 18 సంవత్సరాలు పనిచేసిన వీరికి 10,000 కూడా వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో జీతాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, 11 నెలలు గడుస్తున్నా వేతనాలు పెంచకపోవడం బాధాకరమైన విషయమన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూ నియన్ , జిల్లా అధ్యక్షులు అంజయ్య, చంద్రశేఖర్ గౌడ్ , హుస్సేనప్ప, వెంకట్ నాయక్ , రాజ్ కుమార్ , చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల సేవాదళ్ వేడుకలను..

విజయవంతం చేద్దాం

- కాంగ్రెస్ సేవాదళ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ వాజిద్ మహెక్
- జిల్లా సేవాదళ్ సర్వసభ్య సమావేశం



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని సేవాదళ్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జీ వాజిద్ మహెక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాజిద్ మహెక్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే నెలలో హైదరాబాద్ లో జరిగే వందేళ్ల సేవాదళ్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో జిల్లాలోని సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో అర్హులైన సేవాదళ్ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ మేరకు తనవంతుగా అరువులు అయిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచేవిధంగా ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళుతానని అన్నారు. రాష్ట్రప్రధాన కార్యదర్శి అన్వర్‌పాషా మాట్లాడుతూ నామినెటెడ్ పదవుల్లో సేవాదళ్ కార్యకర్తలకు చోటు కల్పించాలని కోరారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ విభాగం సేవలు ఎనలేనివని అన్నారు. సేవాదళ్ విభాగానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు లోక్ నాథ్, పట్టణ అధ్యక్షులు అలీ, అసెంబ్లీ అధ్యక్షులు జగదీశ్వర్, సురేందర్ గౌడ్ , డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు పోలీస్ సిబ్బందిని కేటాయించండి

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



నవతెలంగాణ - జడ్చర్ల

పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలు, లావాదేవీలను దృష్టిలో ఉంచుకొని జడ్చర్లకు అదనపు పోలీస్ సిబ్బందిని కేటాయించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి డీజీపీని కోరారు. సోమవారం రాష్ట్ర డీజీపీ డా. జితేందర్‌ను కలిశారు. జడ్చర్ల పట్టణంలో ప్రస్తుతం స్థానిక స్థానికేతరుల జనాభా 1.25 లక్షల దాకా ఉండగా ప్రతిరోజూ 30 వేల మంది పట్టణానికి రాక పోకలు సాగిస్తున్నారని అనిరుధ్‌రెడ్డి చెప్పారు. జడ్చర్ల మండలం జనాభా కూడా లక్ష దాటిందన్నారు. జడ్చర్ల 44 వ నంబర్ జాతీయ రహదారి, 167 వ నంబర్ జాతీయ రహదారుల కూడలిగా ఉందని గుర్తు చేశారు. అలాగే రైల్వే ద్వారా పెద్ద సంఖ్యలో ఎగుమతి, దిగుమతులు కూడా జరుగుతున్న కారణంగా వాహనాల రాకపోకలు కూడా ఎక్కువగా ఉంటున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కారణంగానే జడ్చర్లలో ఇప్పుడున్న ఒక్క పోలీస్ స్టేషన్‌పై పనిభారం పెరుగుతోందని, దీంతోసమస్యలు పరిష్కరించడం లో ఇబ్బందులు పెరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలోనే జడ్చర్ల పట్టణంలో అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడానికి, వాహనాల రాకపోకలను నియంత్రించడానికి, ప్రజలకు మరింత మెరుగైన రక్షణ కల్పించడానికి అదనపు పోలీస్ సిబ్బంది కావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ విషయం గురించి సానుకూలంగా స్పందించిన డీజీపీ జితేందర్ ఈ విషయంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

హిందీ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన రూపాదేవి ఉస్మానియా విశ్వ విద్యాలయం హిందీ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందినట్లు సోమవారం పాలమూరు సాహితీ అధ్యక్షులు వేంపల్లి శ్రీకాంత్ తెలిపారు. రాజేంద్ర యాదవ్ కే కథా సాహిత్య మే చేతనా కే ఆయాంలి అనే అంశంపై హిందీ ఆచార్యులు రాజశ్రీ మోరే పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం రూపాదేవి రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

- దాదాపు రూ. 3లక్షల ఆస్తినష్టం



నవతెలంగాణ - గట్టు

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని ఇందువాసి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పల్లిం ఆదాం గుడిసె దగ్ధం కావడంతో గుడిసెలో ఉన్న ఫర్నిచర్, 4 క్వింటాళ్ల సీడ్ పత్తి , దుస్తులు , బియ్యం, వంట సామాగ్రి కాలిపోయాయి. దీంతో దాదాపు మూడు లక్షలు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదు కోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే శిక్ష తప్పదు



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

వాహనదారులు డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే కఠిన శిక్షలు పడతాయని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంతు రెడ్డి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించగా నలుగురికి నగదు జరిమానా , ఒక్కరికీ జరిమానాతో పాటు 2 రోజుల జైలు శిక్ష పడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డీ .జానకి ఆదేశాల మేరకు .. ట్రాఫిక్ సిబ్బంది మహబూబ్‌నగర్ టౌన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. పట్టుబడిన వారిని జడ్జ్ శివధర్ ముందు హాజరు పరచగా ఒక్కరికీ రూ.2000/-, ముగ్గురికి రూ.3000/- రూపాయల చొప్పున మొత్తం రూ.13,000/- నగదు జరిమానా విధించగా మరొకరికి 2 రోజుల జైలు శిక్షా , రూ. 2000/- నగదు జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ అవుతున్నాయని, ఇది వాహనదారులనే కాకుండా ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగిస్తుందని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

ఎట్టకేలకు.. బీసీ కులగణన

- 1931లో బ్రీటీష్ కాలంలోనే గణన
- 94 ఏళ్లుగా కుల గణనపై నోరుమెదని పాలకులు
- నేటినుంచి గ్రామాలలో .. బీసీ కమీషన్ ద్వారా కులగణన

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

అత్యంత జనాభా కల్గిన బీసీల పట్ల పాలకులు చిన్న చూపుతో వివక్ష కనబరుస్తున్నారు. సమగ్ర సర్వే ద్వారా ఒకే రోజు యావత్ రాష్ట్ర ప్రజల ద్వారా సమాచారం తీసుకున్నారు. ప్రతి ఇంటికి తిరిగి ఉద్యోగం, ఉపాధి, భూములు, పశువులు, కోళ్లతో పాటు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సర్వే చేసి గణాంకాలు విడదల చేశారు. ఇంత చేసిన మన పాలకులకు బీసీ గణన మాత్రం గుర్తుకు రావడం లేదు. రాష్ట్రంలో అత్యంత జనాభ కల్గిన బీసీల పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియడం లేదు. బీసీల జనాభా లెక్కించకపోవడం వల్ల రాజ్యాంగం ప్రకారం వీరికి రావల్సిన పథకాలు, ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలేవీ రావడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా బీసీల లెక్క లు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమం అని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీ కుల గణన జరగలేదు. 1931లో బ్రీటీష్ కాలంలో బీసీ లెక్కలు చేశారు. దాని ఆదారంగానే ఇప్పటి వరకు బీసీలను గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లెక్కల చూపి వాటి అంచనాలు తయారు చేసి వాటి ఆదారంగా బీసీలను గుర్తిస్తున్నారు. గతంలో వివిధ సందర్భాలలో కమీషన్‌లు బీసీ గనన చేయాలని సూచి ంచినా.. పాలకులు పెడచెవిన పెట్టారు. 94 ఏళ్ల తర్వాత అయినా.. బీసీకులగణన చేయడానికి పూనుకోవడం ఆహ్వానించ దగ్గ పరిణామం. నిర్ధిష్ఠంగా సమాచారం లేని కారణంగా పెరిగిన జనాభాకు అను కూలంగా పథకాలు బీసీలకు వర్తించడం లేదు. బీసీలకు ఎన్నికలు, ఉపాధి, ఉద్యోగం వంటి అంశాలలో రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ గత కొంత కాలంగా వస్తూ ఉంది. అయితే బీసీ గణన చేయకుండా ఏ ప్రాతిపధికన వెనక బడిన వారికి రిజర్వే షన్లు పెంచుతారని కోర్టు ప్రశ్నిం చడంతో పాలకులది మౌనమే సమాధానం అయ్యింది. ఉమ్మడి రాష్ట్రంలో 138 బీసీ కులాలు ఆమోదం పొంది ఉండగా తెలంగాణలో 112 కులాలు ఉన్నట్లు గుర్తించారు. ఎ గ్రూపులో 7 శాతం, బీ కి 10 శాతం, సీకి 1 శాతం, డీ కులాలకు 7 శాతం, ఈ లో 4 కలుపుకొని ఇప్పటి వరకు 29 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తున్నాయి.ఎమ్మెల్యేలు, ఎంపీలకు రిజర్వేషన్లు వర్తించడం లేదు. కేవలం జనరల్ సీట్లలోనే గెల వాల్సి వస్తోంది. రాజకీయ పార్టీల దయా దాక్షిన్యాల మీద ఆదారపడి వీరికి అవకాశాలు వస్తు న్నాయి.స్థానిక ఎన్నికలకు మాత్రమే రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 45 లక్షల జనా భా ఉంది.ఇక్కడ 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు నియో జకవర్గాలు ఉన్నాయి. జనాభా ప్రకారం ఇందులో సగం స్థానాలు బీసీలకు అందాలి.

ముఖ్యంగా ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే బీసీలు ఉన్నారు. ఇక ఉన్న రెండు ఎంపీ స్థానాలు సైతం ఒక ఎస్సీ మరొటి రెడ్డీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. ఇప్పటికైనా బీసీ కులగణన జరిగితే రాజ్యా ంగం ప్రకారం రా వల్సిన పథకాలు వస్తాయని రాజకీయ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ కులగణన ఆహ్వానించ దగ్గ పరిణామం ..



బ్రిటీష్ కాలంలో చేసిన బీసీ కులగనన తర్వాత పాలకులు ఆ ఊసే ఎత్తలేదు. అనేక సార్లు మేధావులు, కమీ షన్‌లు చెప్పినా పెడ చెవిన పెట్టారు. కులగణన చేయ కపోవడంతో బీసీలకు రాజ్యాంగం ప్రకారం రావల్సిన వాటా రావడం లేదు,. రాష్ట్రంలో కుక్క, కోడీ పిల్లల లెక్కలు తీసి చూయిస్తున్న పాలకులు రాష్ట్ర జనాభాలో సగంఉన్న బీసీల లెక్కలు ఎందుకు తీయ లేదు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీ కులగణన చేయడం సంతోషించదగ్గ పరిణామం.

- కిల్లెగోపాల్,సీపీఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

సత్వరమే ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్,మోహన్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎక్కువగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్,పెన్షన్‌లు మంజూరు, ఆగిపోయిన పెన్షన్‌లు రెన్యువల్, విద్యా శాఖకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి . ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ సమీక్షిస్తూ పెండింగ్ వాటిని వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. మంత్రులు,ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన లేఖలకు వెంటనే రిప్లై ఇవ్వాలని కోరారు. నవంబర్ మొదటి వారం లో నిర్వహి ంచనున్న సాంఘిక, ఆర్థిక, సర్వేకు సంబంధించి 2000 మంది సిబ్బంది ఎన్యుమరేటర్ లు, సూపర్ వైజర్ లుగా అవసరం ఉంటుందని, ఇందుకు సంబంధించి అన్ని శాఖలు మండల స్థాయి వరకు సిబ్బంది వివరాలు వెంటనే అందజేయాలని అ న్నారు. సోమవారం జిల్లా నుంచి 7 గురు మాష్టర్ ట్రైనర్ లు హైద్రాబాద్ లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 51 మందిని జిల్లా ట్రైనర్ లు, మండలంకు 3 గురు చొప్పున ఈ నెల 29 న శిక్షణ ఉంటుందని తెలిపారు. 150 గృహాలకు ఒక ఎన్యుమారేసన్ బ్లాక్‌గా విభజించి ఒక్కొక్క బ్లాక్‌కు ఎన్యుమరేటర్ ,10 బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్ లను నియమించనున్నట్లు తెలిపారు. ఎం.పీ.డీ. ఓ.లు, తహశీల్దార్ లు , మండలం కు ప్రత్యేక అధికారులుగా ఉన్న జిల్లా అధికారులు పర్యవేక్షణా చేస్తారని అన్నారు. సర్వేను 10 రోజుల్లో పూర్తి చేయ వలసి ఉంటుందని అన్నారు. సబ్ సెంటర్‌ల నిర్మాణంకు, పంచాయతీ భవనాల నిర్మాణంకు సంబంధించి భూ సమస్య ఉన్న గ్రామాల వివరాలు రెవెన్యూ అదనపు కలెక్టర్ లు అంద చేయాలని పంచాయతీ రాజ్ ఈ ఈ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిని కలెక్టర్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల పై సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడి డ్రయర్‌లు, టార్పా లిన్ లు సరిపడా సరఫరా చేయాలని అన్నారు. ఈ సమావేశం లో డీ.అర్.డీ. ఓ నర్సింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో..

వామపక్ష సామాజిక శక్తుల విజయం : ఎస్‌ఎఫ్‌ఐ



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో మరోసారి వామపక్ష సామాజిక శక్తుల విజయం సాధించాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కో ప్రైవేటు కళాశాల ఎదుట పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్ యూనివర్సిటీలో ఇంత ఘన విజయానికి ఓట్లు వేసి గెలిపించిన విద్యార్థి లోకానికి జేజేలు తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వామపక్ష, సామాజిక శక్తుల కూటమి మరోసారి ఘన విజయం సాధించిందన్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థులు కీలక కైవసం చేసుకున్నరని అన్నారు. హెచ్ సీయూ అధ్యక్షుడిగా ఉమేష్ అంబేద్కర్(ఎస్ ఎఫ్ ఐ, డీ ఎస్ యూ, ఐ ఎస్ యూ, బీ ఎస్ ఎఫ్ , ఏ ఎస్ ఏ ఫ్యానెల్ గెల్పొందిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కూడా మతోన్మాద ఏబీవీపీని ఓడించి మరోసారి గెలిపించిన హెచ్.సీ.యూ. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో నూతన విద్యా విధానం తీసుకుని రావడం, ఫెలోషిప్స్ తగ్గించడం, ఉన్నత విద్య సంస్థలలో దాడులు చేయడం నిధులు తగ్గించడం చర్యలు బీజేపీ చేస్తుందని ఈ చర్యలను విద్యార్థులు నిరసిస్తూ ఏబీవీపీ ఓడించారని తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణకు విద్యార్థుల పోరాటం స్ఫూర్తి దాయకం అని అన్నారు. ఈ విజయం సాధించిన యూనివర్శిటీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నందు, ఈశ్వర్ , రమేష్ , నాయకులు బన్నీ, శ్రీనాథ్ , సాయి,శివ,మమత ,రాధిక , రమాదేవి పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి : కలెక్టర్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీ.ఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటింటి సర్వే కార్యక్రమం ఏర్పాట్లపై సంబం ధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబరు 4 నుంచి 17 వ వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సర్వే కోసం ఎమ్యూనేటర్లు, ఎమ్యూ నేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలం వారీగా ఎం.పీ.డీ.ఓలు,తహసీల్దార్లు ఎమ్యూనేటర్ల ఎంపికను శ్రద్ధతో జరిపి, వారి వివరాలను బ్లాక్ వారీగా రేపు అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి,అవసరమైన చర్యలు తీసు కోవాలని మునిసిపల్ కమిషనర్లకు ఆదేశించారు. రెవెన్యూ గ్రామాలు, గ్రామ పంచాయతీలలో విలీనం కావడంలో ఎదురవుతున్న సమస్య ల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నిర్వహణ కోసం ఎమ్యూనేటర్లకు సంబంధించిన ప్రత్యేక శిక్షణను ట్రేనర్స్ ఆఫ్ ట్రేనర్స్ ద్వారా ఐ.డీ.ఓ.సీ హాల్‌లో రేపు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే పనిని వేగంగా మరియు విజయవంతంగా పూర్తి చేయడానికి అత్యుత్తమ ఎమ్యూనేటర్లను ఎంపిక చేయాలని, అవసరమైతే అదనంగా ఎమ్యూనేటర్లు కూడా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి తహసీల్దార్,ఎం.పీ.డీ.ఓ దగ్గర గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 57 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తి అయిన ఇంటిపై అతికించు స్టికర్ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా, ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, ఆర్.డీ.ఓ రామ్ చందర్, జెడ్పీ సీ.ఈ.ఓ కాంతమ్మ ,డీ.పీ.ఓ శ్యామ్ సుందర్, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎం.పీ.డీ.ఓ లు తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతిని

ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి

- కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సారంగపాణి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ఆయుర్వేదానికి మూల పురుషుడు నాయీబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన శ్రీ భగవాన్ ధన్వంతరి స్వామి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆయుర్వేదిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సారంగపాణి ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రెడ్ క్రాస్ సొసైటీ హాల్‌లో నిర్వహించిన ధన్వంతరి జయంతి వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి జరగని రోజులలోని అనేక రోగాలకు ఆయుర్వేదం ద్వారా సేవలు అందించిన గొప్ప వ్యక్తి ధన్వాంతరి అనే వారు గుర్తు చేశా రు. వేల సంవత్సరాల క్రితమే ఈ దేశంలో నాయీబ్రాహ్మణులు ఆయుర్వేదిక్ వైద్య మందులు సరఫరా చేశారని తెలిపారు. ఆదిమానవుల కాలంలోని వన మూలికలను గుర్తించి నాటు వైద్యం చేశారని ,అదే నేడు ఆయుర్వేదిక్ వైద్యంగా రూపాంతరం చెందిందని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సన్నాతన బాలరాజు , రవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్ఎస్ ఉమ్మడి జిల్లా ..

నూతన కార్యవర్గం ఎన్నిక



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ లో సోమవారం జరిగిన రాష్ట్ర దూప, దీప నైవేద్య అర్చక సంఘం సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీడీఎన్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జి.రవికుమార్ (మహబూబ్ నగర్), ఉపాధ్యక్షులుగా అశోకా చార్యులు(జోగులాంబ గద్వాల), కార్యదర్శులుగా జోషి రామాచారి (నారాయణపేట), అరవిందాచార్యులు (నాగర్ కర్నూల్), శ్రీధరాచార్యులు (వనపర్తి), కోశాధికారిగా జి.సత్యనారాయణ(నాగర్ కర్నూల్), సాంప్రదాయ కార్యదర్శిగా పవన కుమారాచార్యులు (మహబూబ్నగర్), ప్రధాన సలహా దారులుగా నరసింహచార్యులు (నారాయణ పేట), ప్రచార కార్యదర్శిగా శ్రీహరి చార్యులు (వనపర్తి), సంయుక్త కార్యదర్శులుగా శేఖరయ్య (జోగులాంబ గద్వాల), అరవింద్ కుమార్ (నాగర్ కర్నూల్) లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, కార్యదర్శులు ప్రసాద్ శర్మ, తాపాల వెంకటాద్రి తదితరులు నియామకపత్రం అందజేశారు.

30న గద్వాల్‌కు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాక



నవతెలంగాణ - మల్దకల్

మండలంలోని బిజ్జారం గ్రామానికి చెందిన బీసీ వర్గాల మైనర్ బాలిక వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రాజేశ్వరి మృతిపై గత కొన్ని రోజులక్రితం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సీరియస్ అయ్యారు. ఈ ఘటనపై ఈ నెల 30న బుధవారం బాలిక కుటుంబాని పరామర్శించడానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విచ్చేస్తున్నట్లు టీం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శివ వీర్ తెలిపారు. సోమవారం గద్వాల్ జిల్లా తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు కొమ్ముల ప్రవీణ్ రాజ్‌తో కలిసి మైనర్ బాలిక రాజేశ్వరి స్వగ్రామమైన బీజ్జారంలో పర్యటించారు. రాజేశ్వరి మాతృమూర్తిని పరామర్శించారు.కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ సరిత తిరుపతయ్య బాధిత కుటుంబాన్ని పరామ ర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజేశ్వరి మృతికి కార్మికులైన బండ్ల రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి డబల్ బెడ్ రూమ్ ఇల్లుతో పాటు రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నారా యణపేట జిల్లా తీన్మార్ మల్లన్న టీం సభ్యులు వెంక టరెడ్డి, విజయ్ కుమార్ గౌడ్, జోగులాంబ గద్వాల జిల్లా తీన్మార్ మల్లన్న టీం కో కన్వీనర్ నీల నర్సింలు, మల్దకల్ మండల కన్వీనర్ తిరుమల, జిల్లా అఖిలపక్షం సభ్యులు వెంకట్రాములు, డీకే సుందర్ రాజ్, జ్యోతక్క, రవి, ప్రకాష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్



నవతెలంగాణ-వీపనగండ్ల

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. ఈగలు, దోమలవల్ల వ్యాప్తి చెందే అంటువ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు, హేమ వర్ధన్, కరుణశ్రీ, భాగ్యశ్రీ, శ్వేత, కేశవులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవో బదిలీ

నవతెలంగాణ- వనపర్తి

సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు, అదనపు కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్‌ను మెదక్ జిల్లాకు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లును వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూగా బదిలీ చేశారు. ఆర్డీఓ పద్మావతిని నారాయణపేట స్పెషల్ డిప్యూటీ కలక్టర్ గాను, ఆర్డీఓ నారాయణపేట మధుమోహన్‌ను వనపర్తి స్పెషల్ డిప్యూటీ కలక్టర్ (ఎస్‌డిసి) గా బదిలీ చేశారు. వనపర్తి స్పెషల్ డిప్యూటీ కలక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లును భూపాలపల్లికి బదిలీ చేసి నల్గొండ ఎస్‌డిసి దరూరు సుబ్రమణ్యం ను వనపర్తి ఆర్డీఓ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యం.నగేష్ 2024 ఫిబ్రవరి 17 న వనపర్తిలో అదనపు కలక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి పార్లమెంట్ ఎన్నికల విధులు, రెవెన్యూ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించారు.

సీపీఎం జిల్లా మహాసభల లోగో ఆవిష్కరణ



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నవతెలంగాణ-వీపనగండ్ల

మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం పార్టీ సీనియర్ నాయకుడు తూంకుంట భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా మూడో మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యవసర ధరలను పెంచి పేద ప్రజలపై భారాలు మోపుతోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. రైతు రుణమాఫీ అరకొరగా చేసి నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రైతు భరోసా నేటికీ అమలు చేయలేదన్నారు. నవంబర్ 10, 11 తేదీల్లో వీపనగండ్లలో సీపీఎం మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నట్లు తెలిపారు. మహాసభలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించనున్నట్లు తెలిపారు. ఇంతకుముందు మహాసభలను జయప్రదం చేయాలంటూ గ్రామంలో ఇంటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు బాలస్వామి, సీహెచ్ వెంకటయ్య, పెద్ద ఖాజా నాయకులు మురళి, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర గౌడ్, మాందాపురం నరసింహ, రామన్ గౌడ్, వేటూరి కురుమయ్య , రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రాంపురం రోడ్డు పనులు ప్రారంభం

• ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేరు మండల పరిధిలోని రాంపురం గ్రామం నుంచి 44వ జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారి నుండి రాంపురం గ్రామం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా అంచనా వేసి రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గంధం రాజశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, జిల్లా యువజన నాయకులు రంజిత్ , మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు సత్యా నారాయణ రెడ్డి, శివకుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఎం.నాగేంద్రం తలకు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నాడు. విషయాన్ని స్థానిక నాయకులు వేణుగోపాల్, లక్ష్మణ్‌నాయుడు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన బాధితుడికి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ అందజేసి చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు పంపించాలని స్థానిక నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, తోమాలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మండల సత్య నారాయణ రెడ్డి, వేణు గోపాల్, లక్ష్మణ్‌నాయుడు, శివకుమార్, బాలరాజు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని వీరరాఘపురం, తూంపల్లి గ్రామాల్లో రైతులకు నకిలీ వరి విత్తనాలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలంటూ సోమవారం ఆయాగ్రామాల రైతుల కలెక్టర్ కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పెబ్బేరు పట్టణంలోని అన్నపూర్ణ ట్రేడర్స్‌లో 999 ఇండిగో ఫ్లస్ 10 కేజీల బస్తాలను కొనుగోలు చేసి విత్తగా ఎక్కువ మోతాదులో బెరడు వడ్లు వచ్చాయన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిపై వ్యవసాయాధికారులతో విచారణ చేయించి విత్తన విక్రయ దారులపై చర్య తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోనరేష్, వీరరాఘపురంఆంజనేయులు, సత్యరెడ్డి, బాలరాజు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించండి

నవతెలంగాణ-ఆత్మకూర్

అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని 1,2,4,6,7 వార్డుల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సదర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ మునిసిపాలిటీ ఏర్పడి నాలుగున్నర సంవత్సరాలు దాటినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. అనతరం కమిషనర్ నూరుల్ నజీబ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అబ్రహం రవీందర్ శ్యాంసుందర్ లక్ష్మీనారాయణ సౌలు ఎర్రన్న తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ -మదనాపురం

మదనాపురం మండలంలోని రామన్ పాడ్,అజ్జకోలు,కొత్తకోట మండలంలోని చర్లపల్లి, ఆత్మకూర్ మండలం తిపుడంపల్లి గ్రామాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ నరసింహులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనాపురం మండల కేంద్రంలోని గురుకుల కళాశాల ముందు ఉదయం నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతు పనులు జరుగుతాయని అందుకుగాను ఎర్రగట్టు దగ్గర ఉన్న సబ్ స్టేషన్ నుండి కరెంట్ సరపరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించండి

నవతెలంగాణ - ఆత్మకూరు

రైతాంగ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ సోమవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తాసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, చిన్న రాయుడు, మనివర్ధన్, కురుమన్న, వెంకటన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు సన్నద్ధమవ్వాలి

• కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

నవతెలంగాణ-వనపర్తి

త్వరలో ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించడానికి ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 18 విడుదల చేయడం జరిగిందని, సర్వే కొరకు త్వరలో పూర్తిస్థాయి విధి విధానాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఒక్క ఇల్లు, కుటుంబం వదలకుండా అన్ని కుటుంబాలు, ఇండ్లు సర్వేలో నమోదు అయ్యే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. 2011 సర్వే ప్రకారం ఉన్న ఎన్యుమరేషన్ బ్లాక్‌లను గుర్తించి వాటి ప్రకారం మున్సిపాలిటీ, గ్రామస్థాయిలో ఎన్యుమరేటర్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, వీఏఓలను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేయాలని సూచించారు. మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లు, సీనియర్ అసిస్టెంట్, ఎంపీడీఓ, ఎంపీఓలు తదితర సిబ్బందిని సూపర్వైజర్లుగా ఎంపిక చేయడం జరుగుతుంది. మండల నోడల్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులను ఎంపిక చేసి సమగ్ర ప్రణాళికతో సర్వేకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సర్వేపై మాస్టర్ ట్రైనర్లు త్వరలో మండల, గ్రామ స్థాయి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వనపర్తి జిల్లాలో 5 మున్సిపాలిటీలతో పాటు 228 రెవెన్యూ గ్రామాలు అందులో 262 గ్రామ పంచాయతీల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. 2011 తర్వాత కొత్తగా ఏర్పడిన ఆవాస ప్రాంతాలు, ఇళ్లను గుర్తించి ఎన్యుమరెటర్ బ్లాకులు చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, ఆర్డీఓ పద్మావతి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్‌లతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ

సమాజంలో అవినీతిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సూచన మేరకు అధికారులు, సిబ్బందితో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశ పౌరునిగా అవినీతిని ప్రోత్సహించనని, అవినీతికి పాల్పడనని దేశాన్ని అవినీతి రహితంగా రూపుదిద్దడంలో నావంతు కృషి చేస్తానని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డివో పద్మావతి, జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలక్టరల్ రోల్ ముసాయిదా విడుదల

స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా అక్టోబర్ 29న ముసాయిదా ఎలక్టరల్ రోల్ విడుదల చేయనున్నట్లు జిల్లా కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి నేడోక ప్రకటనలో తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా మంగళవారం నుండి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉంచడం జరుగుతుందని, ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో సరిగ్గా ఉన్నది లేనిది సరిచూసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి, 2న వెలువరించిన ఓటరు తుది జాబితా ప్రకారం వనపర్తి జిల్లాలో 272653 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 274887 మంది ఓటర్లు ఉన్నారు. 5455 మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకోగా 3221మంది పేర్లు ఫారం 7 ద్వారా తొలగించడం జరిగింది. మొత్తం ఓటర్లలో పురుషులు 136208 కాగా మహిళా ఓటర్లు 138676 ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే అక్టోబర్ 29 నుండి నవంబర్ 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను డిసెంబర్, 24 వరకు పరిష్కరించి 2025 జనవరి, 6వ తేదీన తుది జాబితా వెలువరించడం జరుగుతుందని తెలియజేశారు. తప్పులు లేని శుద్ధమైన ఓటరు జాబితా రూపొందించేందుకు ఓటరు జాబితాను పరిశీలించుకోవాలని కోరారు.

సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ



నవతెలంగాణ -వనపర్తి రూరల్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సైకిల్ ర్యాలీని ఎస్పీ రావుల గిరిధర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి బస్టాండ్ , పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజారక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికుల లాగా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నామన్నారు. అమరవీరుల స్ఫూర్తితో సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని సూచించారు. ఈనెల31 వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, ఏఆర్ డీఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్ జిల్లాలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, యువకులు, విద్యార్థులు, వాకర్స్ పాల్గొన్నారు.

ప్రజావాణికి ఎనిమిది ఫిర్యాదులు

సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎనిమిది ఫిర్యాదులు అందాయని ఎస్పీ ఆర్.గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో నాలుగు భూ తగాదాలు, నాలుగు పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని తెలిపారు.

చేప పిల్లలు విడుదల

నవతెలంగాణ-వీపనగండ్ల

మండలంలోని గోపాల్ దిన్నె రిజర్వాయర్‌లో సోమవారం మత్స్యశాఖ జిల్లా ఫీల్డ్ అధికారి భరత్ చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్ దిన్నె రిజర్వాయర్‌లో లక్ష 80 వేలు, వీపనగండ్ల గ్రామంలోని యాదిరెడ్డి కుంట, ఊర కుంటల్లో 30 వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. మత్స్య కార్మికుల అభివృద్ధి కోసం ప్రభుత్వం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సతీష్, ప్రసన్న కుమారి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ గోదాల బీరయ్య యాదవ్, మత్స్యకార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు సంగం వెంకటయ్య, నాయకులు రామకృష్ణ, సురేష్, శ్రీనివాసులు, వెంకటయ్య, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రషర్లను తొలగించండి

నవతెలంగాణ-మదనాపురం

మదనాపురం మండలంలో రోడ్డు పక్కన ఉన్న క్రషర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక నాయకుడు బిట్ల రాజశేఖర్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర పర్యావరణ చీఫ్ ఇంజనీర్ రఘుకి వినతి పత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో చీఫ్ ఇంజనీర్‌ను ఆయన కలిసి మాట్లాడుతూ మదనాపురం మండలంలోని ఎంపీఆర్ క్రషర్, గాయత్రి మణి కంకం క్రషర్‌ల నుంచి వచ్చే దుమ్ము దూళితో వహనదారులు ఇబ్బందులు పడడంతో పాటు దుమ్ముతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాన బారిన పడుతున్నారన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా క్రషర్లను రోడ్డు పక్కల ఉండకుండా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడిసిన్ విద్యార్థినికి సీపీఎం నాయకుల సన్మానం



విద్యార్థిని యామినిరెడ్డిని సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

నవతెలంగాణ -వీపనగండ్ల

మెడికల్ సీటు సాధించిన మండల కేంద్రానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి లావణ్య కూతురు యామిని రెడ్డిని సోమవారం సీపీఎం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు తూముకుంట భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. వైద్య విద్య పూర్తి చేసి గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా నాయకుడు పెద్ద ఖాజా, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మురళి, మండల నాయకులు సీహెచ్ వెంకటయ్య, శాఖ కార్యదర్శులు ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వరగౌడ్, మాదాపురం నరసింహ, రామన్ గౌడ్, ఏటూరి నరసింహ, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్య పరిచేందుకు అవార్డుల ప్రధానం

నవతెలంగాణ- వనపర్తి

2024 సంవత్సరంలో ఓటర్లను చైతన్య పరచేందుకు మీడియా ద్వారా చేసిన ప్రచారం, రాసిన ఆర్టికల్, క్యాంపెయిన్‌లను సిడీ/డివిడి లేదా పెన్ డ్రైవ్ లో రూపొందించి నవంబర్ 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని వనపర్తి జిల్లా డీపీఆర్ఓ సీతారాం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మీడియా అవార్డులు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోందని, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా(టీవీ) ఎలక్ట్రానిక్ రేడియో, ఆన్లైన్/ సోష ల్ మీడియా ప్రతినిధులు, విలేకరులు తమ వార్త కథనాలపై రిపోర్టు చేయా లని సూచించారు. దరఖాస్తును కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయానికి అందే విధంగా చూసుకోవాలన్నారు. తమ ఒరిజినల్ క్లిప్పింగ్ లతో పాటు వాటిని ఇంగ్లీష్‌లో తర్జుమా చేయించి పంపవలసి ఉంటుందన్నారు. అలా చేయకుంటే తిరస్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీ డియా మిత్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. మరింత సమాచారానికి స్థానిక డీపీఆర్ఓ కార్యాలయంలో సంప్రదిం చాలని తెలిపారు.

రైతులకు సంకెళ్లేసిన ఘనత బీఆర్ఎస్‌ది

నవతెలంగాణ -వనపర్తి

రైతులకు సంకెళ్లు వేసి కోర్టుకు పంపించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండ్ల దేవన్న నాయుడు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వనపర్తిలో రైతు ధర్నా పేరుతో ఇక్కడున్నరైతులను, ప్రజలను మభ్య పెట్టడం తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల్లో లక్ష రుణమాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రైతు ధర్నా చేసే నైతికహక్కు బి ఆర్ఎస్‌కు లేదన్నారు. మాజీ మంత్రి చేయాల్సింది రైతు నిరసన సదస్సు కాదని, రెండు లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలాభిషేకాలు చేయాలని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com

కాటమయ్య కిట్స్‌తో గీతా కార్మికులకు రక్షణ

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నవతెలంగాణ-కల్వకుర్తి

గీతా కార్మికుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కాటమయ్య కిట్స్‌తో కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి, వెల్దండ మండలాల పరిధిలోని దాదాపు 54 మంది గీతా కార్మికులకు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాటమయ్య కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడి టీచర్ పోస్ట్ ఇవ్వాలని..
స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఉప్పునుంతల

మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పానుగంటి పరమేశ్వరికి అంగన్వాడీ టీచర్ పోస్టు ఇవ్వాలంటూ సోమవారం హైదరాబాద్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పానుగంటి పరమేశ్వరి 2018 నుండి హెల్పర్‌గా విధులు నిర్వహిస్తోందని, మొదటి సెంటర్‌లో అక్కడున్న టీచరు ఏ.లక్ష్మమ్మ అనారోగ్యంతో చనిపోవడంతో ప్రభుత్వం యొక్క గైడ్లైన్స్ ప్రకారంగా ఆమెకే టీచర్ పోస్టు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆ పోస్టును పరమేశ్వరికి ఇవ్వకుంటే ఆందోళన చేస్తా మని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు పానుగంటి పరమేశ్వరి, చిన్నరవి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మల్లేష్ ఉన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



ఉప్పునుంతల : రెవెన్యూ తహసిల్దార్ కార్యాలయాల్లో అధికారులు పదోన్నతిపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బదిలీపై వస్తూ.. పోతూ ఆదేశాలు జారీ చేసిన చోట విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఒక తహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన నుండి బదిలీపై వెళ్తున్న వరకు ఆ పదవి కాలం పట్టికలో చేర్చాల్సిన అధికారుల పేర్లు నేటికి పట్టికలోకి చేర్చడం లేదు. దీనికి నిదర్శనం నిర్లక్ష్యమేనని చెప్పుకోవచ్చు. ముగ్గురు ఎమ్మార్వోలు బదిలీ కాగా ఇప్పుడు వచ్చిన ఎమ్మార్వో ప్రమీల దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఉప తహసిల్దార్ కేశవ్ ఇంచార్జ్ ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వహిస్తున్నారు. ఇన్చార్జి ఎమ్మార్వోతో సోమవారం నవతెలంగాణ ముఖాముఖి మాట్లా డుతూ పదవికాలం పట్టిక బోర్డు, కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యంపై వివరణ కోరగా రెండు, మూడు రోజులలో రాపిస్తానని, ప్రజల తాగునీటి గురించి ఆలోచించి ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వేరుశనగ సామూహిక ప్రదర్శన క్షేత్రాలపై శిక్షణ

నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం పాలెంలో యత్ మతాపూర్, ఖానాపూర్, వసంతాపూర్, నల్లవెల్లి, పర్వతాపూర్ గ్రామాల రైతులకు వేరుశనగపై సామూహిక ప్రదర్శన క్షేత్రాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.ప్రభాకర్ రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డి నేటర్ కేవీకే పాలెం మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత పథకం కింద అధిక మొత్తంలో నూనె గింజ పంటల సాగును ప్రోత్సహించడం కింద 4 ఎకరాల వేరుశనగ పంటను సామూహిక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పరిచి రైతులకు పంట యొక్క కీలక ఉత్పాదకాలను వినియోగం, మేలైన యాజమాన్య పద్ధతుల గురిం చి వివరించారు. అనంతరం పంటలలో ఉపయోగించడానికి అవసరమైన కలు పు మందు క్రిమిసంహారకాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ విస్తరణ శాస్త్రవేత్త, డాక్టర్ ఓ.శైల, కె.రామకృష్ణ, 58 మంది రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

నవతెలంగాణబిజినేపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 14వ విడత సామాజిక తనిఖీ సభ మంగళవారం మండల పరిషత్ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.కథలప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుండి మార్చి 31, 2024 వరకు జరిగిన పనులపై తనిఖీ చేసి ప్రతి గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించి వారికి డబ్బులు అందాయా లేదా అనే విషయాలపై తనిఖీ నిర్వహించారు. సమాచారంతో ప్రజా వేదిక సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.కాబట్టి మండలంలో ఉన్న గ్రామాల నుండి అధిక సంఖ్యలో కూలీలు రావాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-అచ్చంపేట

తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర బీసీ కులగణన, చట్ట సభలలో బీసీ రిజర్వేషన్లు అనే అంశంపై నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తునట్లు బీసీ కులాల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎంఎం.గౌడ్ తెలిపారు. తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి లక్ష్య సాధన కోసం బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారం కోసం ఏర్పాటు చేసిన బీసీ కులాల ఫెడరేషన్ ఏర్పాటయ్యిందన్నారు. అన్ని బీసీ సంఘాలు, బీసీ విద్యార్థి సంఘాలు, బీసీ ఉద్యోగ సంఘాలు, బీసీ మేధావులు, కవులు, కళాకారులు అన్ని సామాజిక ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశానికి పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-బిజినేపల్లి

ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై సోమవారం తహసీల్దారు శ్రీరాములుకు తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్లు వినతిపత్రం అందజేశారు. వారి వెంట ఉపాధ్యాయు లు రామకృష్ణ, విష్ణుమూర్తి, అనంద్, భాగ్యలక్ష్మి, రాధ తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్

పట్టణంలోని 22వ వార్డులో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ సత్యం సోమవారం భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.25 లక్షలతో 18 ఫీట్ల వెడల్పులో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ భోజిరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త జూలూరి రమేష్ బాబు, బీఆర్ఎస్ నాయకులు బాబండ్ల మధు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'క్రీడలు ఏకాగ్రతను పెంపొందిస్తాయి'

నవతెలంగాణ - ఊరుకొండ

విద్యార్థులు చిన్ననాటి నుండి విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల ద్వారా శారీరక దారుడ్యం, మానసిక ఉల్లాసంతోపాటు ఏకాగ్రత పెంపొందుతుందని శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాల కరస్పాండెంట్ బాల్‌రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక కావడంతో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో జశ్వంత్, చంద్రహాస్, మైత్రిలను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జార్జ్, వైస్ ప్రిన్సిపాల్ రామ్, పిఈటి భీమ్, ఉపాధ్యాయులున్నారు.

'జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

పెద్దకొత్తపల్లి : మండలంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.దశరథం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో నాగేంద్రంకు పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ ప్రెసిడెంట్ ఇంద్రకంటి బాలస్వామి, ఉపాధ్యక్షులు సిద్ధయ్య, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మూఢనమ్మకాలు



ఉప్పునుంతల : పట్టణం పల్లె అనే తేడా లేకుండా మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ప్రజలు మూఢనమ్మకాలు నమ్మి బాబాలు, స్వామీజీల చుట్టూ తిరిగి వారు చెప్పింది నమ్మి జేబులు ఖాలీ చేసుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. స్వామీజీలు అమాయక ప్రజలను ఆసరా చేసుకొని లేని వాటిని అంటకట్టి ఆగమాగం చేస్తూ పైసలు దండుకుంటున్నారు. సోమవారం మండలంలో తాడూరు గ్రామ పరిధిలోని తూర్పు వైపు బీటీ రోడ్డు పై గుమ్మడికాయ, పసుపు, కుంకుమ అన్నం ముద్దలు కనిపించి ప్రయాణికులకు భయాందోళనలకు గురిచేశారు. వీటిపై ప్రభుత్వం మూఢనమ్మకాల పట్ల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజావాణికి 80 ఫిర్యాదులు



నవతెలంగాణ-కందనూలు

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవ సహాయం తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా 80 దరఖాస్తులు అందాయని జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు, దేవ సహాయం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్య ల పరిష్కారం కోసం ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రజావాణికి అధిక మొత్తంలో ధరణి సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయని, కావున అధికారులు త్వరితగతిన ధరణి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్, దేవ సహాయం, సంబంధిత శాఖ అధికారులతో కులగణన చేపట్టేందుకు ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కులగణన ప్రక్రియను జిల్లాలో అత్యంత పారదర్శకంగా సజావుగా నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. త్వరలో ప్రారంభమయ్యే కులగణన ప్రారంభం అవుతుందని, అందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని, అధికారులు కుల గణనలో క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. కులగణన వేగవంతమయ్యేందుకు సిబ్బందికి సమర్థవంత శిక్షణా తరగతులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. కులగణనకు తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలను క్షేత్రస్థాయి పర్యవేక్షకులుగా నియమించాలని అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ కుల గణన సర్వేకు సంబంధించి సిబ్బంది నియామకాన్ని పూర్తిచేయాలని, ఇంటింటి సర్వే ప్రారంభించే దిశగా అధికారులు సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ నోడల్ ఆఫీసర్‌గా నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, నాగర్ కర్నూల్, కొల్లాపూర్ కల్వకుర్తి, అచ్చంపేట మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



నవతెలంగాణ-కందనూలు

మహిళలు స్వయం శక్తితో ఆర్థిక ప్రయోజకు లుగా మారి అన్ని రంగాలలో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి, శ్రీ శక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం పని చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇదే సదవకాశం : ఎమ్మెల్యే

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకు నుండి రుణాలు పొందేలా ఆసక్తిగా ఉన్న నిరుద్యోగ యువతకు ఇది ఒక మంచి సదవకాశం అవుతుందని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 29న జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో ఆయా బ్యాంక్ అధికారులతో నిరుద్యోగ యువతకు రుణాలు పొందేందుకు గల అభ్యంతరాలు, సబ్సిడీ అవాంతరాలు తొలిగేలా తగు సూచనలు సలహాలిచ్చేందుకు జిల్లా కలెక్టర్, డీఆర్డీఓ, ఇండస్ట్రియల్, బ్యాంక్ అధికారులతో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుపై భారం

- కాసారం రైతుతో తెప్పించి అమర్చిన లైన్‌మెన్



స్పందన

నవతెలంగాణ-ఉప్పునుంతల

ప్రమాదానికి తోరణం విద్యుత్ శాఖ మేలుకో అనే కథనా న్ని నవతెలంగాణ పత్రికలో శనివారం ప్రచురించగా విద్యు త్ శాఖ యంత్రాంగం స్పందించి తక్షణమే చర్యలు చేపట్టి విద్యుత్ స్తంభాల కరెంటు తీగలు ఎల్ టి లైన్‌కి కట్టెను తొలగించి కాసారం అమర్చి వాహనదారు లకు రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాన్ని చూసిన ఎల్ టి లైన్ సమీప రైతు చరావాణిలో నవతెలంగాణ తో మాట్లాడుతూ లైన్‌మెన్ నన్నే తీసుకురావాలన్నారు. నాకు అవగాహన లేక నేనే స్వయంగా తీసుకువచ్చానని రైతు తెలిపాడు. మరమ్మతులపై విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏఈ కొండల్‌ను వివరణ కోరగా మరమ్మతుల కోసం రైతులపై ఎలాంటి భారం వెయ్యమని, మేమే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా బాలస్వామి



వంగూరు : సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా బండపల్లి బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) పార్టీలో సభ్యత్వం పొందినపుటి నుండి ఇప్పటివర కు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలను ఉత్తేజం చేస్తున్న బాలస్వామిని మరలా సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళా అధికారులకు దక్కని గౌరవం

తాడూరు : కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీలో తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో జ్యోతి పరోసియాలకు సరైన గౌరవం దక్కలేదని దీనికి కారణం బడుగు బలహీన వర్గాలకు చెందిన అధికారులు కావడమేనానని..? మీటింగ్‌కు హాజరైన పలువురు చర్చించుకున్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాల యంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కళ్యాణ్ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు పంపిణీ చేస్తున్న సమయంలో అధికారులను ఎక్కడో ఓ మూలకు నెట్టి ఎమ్మెల్యే అధికార పార్టీ నాయకులు చెక్కుల పంపిణీలో ముందు వరుసలో ఉండి పంపిణీ చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి దరఖాస్తుదారులు నేరుగా వస్తే ఫైల్‌పై సంతకం చేయనని, ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకు లను గాని, కార్యకర్తలను గాని తీసుకువస్తేనే ఫైల్‌పై సంతకం చేస్తానని ఆయన సభాముఖంగా ఖరాఖండిగా చెప్పారు. అంతకుముందు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సహకార సంఘం భవనాన్ని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని సాదాపూర్ గ్రామానికి చెందిన కోళ్ల శ్రీను అనే రైతు, కరెంట్ మెకానిక్ సోమవారం గంట్రావుపల్లి గ్రామ స్టేజి వెనుక కరెంటు పని రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు కోళ్ల శ్రీనుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారని వారు తెలిపారు. మృతి చెందిన కోళ్ల శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఊరుకొండ : మండల పరిధిలోని ఊరుకొండపేట గ్రామానికి చెందిన కప్పెర ఎల్లమ్మ(55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి తక్షణమే స్పందించి రూ.5వేలు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తిరుమణి రవీందర్ గౌడ్ రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు.

కేజీబీవీల్లో ఏఎన్ఎం, అకౌంటెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కందనూలు

జిల్లాలో కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్‌ఎం, అకౌంటెంట్‌లుగా పని చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.గోవింద రాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏఎన్ఎం-1, అకౌంటెంట్-7 ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు అచ్చంపేట, కొల్లాపూర్, కోడేరు, పదరా, బిజినపల్లి, అమ్రాబాద్ కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్ల పోస్టులు, వంగూరు కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇంటర్మీడియట్‌తో పాటు ఏఎన్ఎం శిక్షణ పొందిన సర్టిఫికేట్ ఉండాలన్నారు. అకౌంటెంట్ కోసం గ్రాడ్యుయేట్ కామర్స్, ఎంకామ్ సర్టిఫికెట్, బికామ్ కంప్యూటర్, బేసిక్ కంప్యూటర్ కలిగి కోర్సులు కలిగి ఉండాలన్నారు.

నాగర్‌కర్నూల్ అర్బన్ రెసిడెన్షి యల్ పాఠశాల నందు ఖాళీగా ఉన్న 1 అకౌంటెంట్ పోస్టుకు పురుష అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకో వచ్చన్నారు. దరఖాస్తులను ఈనెల 29 నుండి నవంబర్ 6వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించాలని కోరారు.

ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన : డీఈఓ

ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించేందుకు జిల్లాలో 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ కలిగిన టీచర్ల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ మంగళవారం, బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ గోవిందరాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ బీఈడీ కలిగి డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన ప్రత్యేక అవసరాల విద్యార్థుల బోధన ఉపాధ్యాయుల 1:3 నిష్పత్తి ప్రాతి పదికన ఎంపికైన అభ్యర్థుల వివరాలను నాగర్‌కర్నూల్ జిల్లా వెబ్‌సైట్ https://deonagarkurnool.weebly.com లో ఉంచ డం జరిగిందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో హాజరుకావాలని డీఈఓ కోరారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం పట్ల హర్షణీయం

- సభ కన్వీనర్ డా.మాణిక్యాల చెన్నయ్య

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాలు కుట్రలు చేసి సుప్రీంకోర్టు ధర్మాసనం చే తప్పుడు లెక్కలతో వర్గీకరణ అంటూ సూచన చేయించాడన్ని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయడం హర్షనీయమని, ఇందుకు సహకరించిన నాయకులకు సభ కన్వీనర్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య అభినందనలు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల నుండి మాలలు సునామీల తరలివచ్చి సభను విజయవంతం చేశారని కొనియాడారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరచడం వల్లే నేడు మాల మాదిగలు లబ్ది పొందారన్నారు. అలాంటి డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను కొంతమంది మాదిగ నేతలు విమర్శలు చేస్తున్నారని, వర్గీకరణ అంశం ఎలా వచ్చిందని నిలదీశారు. 1994లో మందకృష్ణ మాదిగ తప్పుడు లెక్కలతో వర్గీకరణ ఉద్యమాన్ని చేపట్టి మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ లబ్ది పొందాలని మనువాద పార్టీ అయినా బీజేపీకి అండగా నిలుస్తూ దళితులకు వ్యతిరేకంగా ఉన్న అనేక చట్టాలను ఆమోదించుకోవడంలో కేంద్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న మాలలను చీల్చేందుకు చంద్రబాబు నాయుడు కుట్రలు చేశారన్నారు. వారికి ప్రస్తుత బీజేపీ నేతలు వంత పాడడం మాలలను అవమానించడమేనని, అలాంటి వారికి రాబోయే రోజులలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నూతనంగా కులగన చేసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను ప్రకటించాలని మాల మహానాడు డిమాండ్ చేస్తుందన్నారు. మాలల ఓట్లతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలకు వత్తాసు పలుకుతూ మాలల ఆత్మగౌరవం దెబ్బతీయడం సహించమన్నారు. నవంబర్ నెల 24న హైదరాబాదులో పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్‌రావు, శ్రీనివాసులు, మద్దేల చంటి, సంకి కుర్మయ్య, సుదర్శన్, వెంకట్రావు, కేశవులున్నారు.

డా.వంశీకృష్ణ, గోరేటి వెంకన్న

వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలి

- మాజీ జడ్పీటీసీ మంగి విజయ్

నాగర్‌కర్నూల్ రూరల్ : ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని మాజీ జడ్పీటీసీ మంగి విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మాదిగ ప్రజా సంఘాల నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జడ్పీ హైస్కూల్ గ్రౌంగ్‌లో ఆదివారం నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభలో రాజ్యాంగ పదవిలో ఉన్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఢిల్లీ సింహపురి ఎమ్మెల్యే పాల్గొనడం సబబు కాదన్నారు. గత 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం వివిధ రూపాలలో పోరాటాలు జరిగాయన్నారు. సమస్య తీవ్రతను బట్టి జస్టిస్ రామచంద్ర రాజు కమిటీ, ఉషా మెహ్రా కమిషన్ కమిటీలతో లోతైన విచారణ జరిపి, న్యాయమైన డిమాండ్‌గా గుర్తించి ఎస్సీలలో వెనుకబడిన ఉప కులాలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ అవసరమేనన్నారు. తద్వారా వర్గీకరణ జరగడం, సుప్రీంకోర్టు రాష్ట్రాలకు వర్గీకరణ చేసే హక్కు లేదంటూ కొట్టివేసిందన్నారు. అప్పుడు సుప్రీంకోర్టు తీర్పును గౌరవించిన మాలలు, ఇప్పుడు రాష్ట్రాలకు హక్కులు కల్పిస్తూ వర్గీకరణ చేసుకోవచ్చని చెప్పిన తీర్పులో తప్పేముందో చెప్పాలని డిమాండ్ చేశారు. 30ఏళ్లుగా మడమ తిప్పక, పదవులకు ఆశపడక అలుపెరుగని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగపై చిల్లర మాటలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా మాదిగ కుల సంఘాల నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, బీఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి గడ్డం విజయ్ కుమార్, సామాజిక సాహితీవేత్త ఎదిరే కాశన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగు తెలుగు దినపత్రిక
నారాయణపేట
మంగళవారం | అక్టోబర్ 29, 2023 | www.navatelangana.com

నవంబర్ 3, 4 తేదీలలో సిపిఎం జిల్లా మహాసభలు



మక్తల్ : నవంబర్ 3, 4 తేదీలలో మక్తల్ పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎం) రెండవ జిల్లా మహాసభలు జరగనున్నాయని మహాసభలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, టి.సాగర్ తెలిపారు. సోమవారం మక్తల్ నియోజక కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం సమావేశంలో వారు మట్లాడారు. నవంబరు 3న మక్తల్ పట్టణంలో గొప్ప బహిరంగ సభ ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతంగా పోరాడుతున్న సీపీఐ(ఎం) మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగానికి లౌకికత్వానికి మతోన్మాదుల నుంచి ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. దేశ సంపదను బడ పారిశ్రామికవేత్తలకు దరదత్తం చేసే పద్ధతిని వ్యతిరేఖించాలన్నారు. సీపీఎం రాష్ట్ర నేత భూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు బేషరతుగా అమలు చేయాలన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని సత్వరమే పనులు ప్రారంభించాలని, భరత్ మాల బాధితులకు తగు న్యాయం చేయాలన్నారు. మక్తల్-నారాయణపేట రోడ్డును బాగు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణా రైల్వే లైన్ మంజూరు చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ఇంటిస్థలం, రెండు పడక గదుల ఇల్లు, రేషన్ కార్డు అందిఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రైతు రుణమాఫీ వర్తింపచేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పుంజనూరు ఆంజనేయులు, గోవింద్ రాజ్, ఉద్మల్ గిద్ద గోపాల్, బండమీది బల్‌రామ్, అంజిలయ్య గౌడ్, జోషి, దస్తప్ప అశోక్, కాశప్ప, మహ్మద్ అలీ, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి : ఎస్పీ



నవతెలంగాణ - నారాయణపేట

ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి 8 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించ వలసిందిగా సీఐ, ఎస్ఐలకు సూచించారు. వచ్చిన ఫిర్యాదులలో 2 ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబంధించినవి, ఒక్క ఫిర్యాదు యాక్సిడెంట్‌కు సంబంధించినది, 5 ఫిర్యాదులు భూములకు సంబంధించినవి వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. భూ తగాదాలకు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని, లేదా సామరస్యంగా మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని, ఏలాంటి ఆవేశాలకు లోను కారదని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకొచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని, వాటిని వెంటనే చట్ట ప్రకారం పరిష్కరించాలని ఫోన్‌లో సంబంధిత అధికారులకు మాట్లాడి సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

తహసీల్దార్‌కు వినతి



మరికల్ : మండల తపస్ ఆధ్వర్యంలో పెండింగ్ డీఏ, పీఆర్సీ బిల్లులు విడుదల చేయాలని, మరికల్ తహసిల్దార్ జమీల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. తహసిల్దార్ జమీల్ మాట్లాడుతూ నేను మా అధికారులకు తెలియజేస్తానని తెలిపారు. తపస్సు మండల అధ్యక్షులు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా మరికల్ మండల ఉద్యోగుల, ఉపాధ్యాయులు, కలిసి బకాయిలు ఉన్న నాలుగు డీఏలు, వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ-కుబేర ఉన్న పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి, మూడు అంశాలపై 22-11-2024 వరకు పరిష్కరించాన్నారు. లేనియెడల 23-11-2024 హైదరాబాదులో ధర్మ గ్రహ దీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శివ శంకర్, నటరాజ్, శ్రీనివాసులు, రంజిత్ కుమార్, రాఘవేందర్, చంద్రశేఖర్, శ్రీను, సురేష్ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు ఇవ్వాలి



మాగనూర్ : పెండింగ్లో ఉన్న డీఏలను వెంబడే ప్రకటించాలని, ఈ కుబేర్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులని వెంటనే విడుదల చేయాలని, నూతన పీఆర్సీని ప్రకటించాలని కోరుతూ తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ధర్మ ఆగ్రాహ దీక్షలో భాగంగా మండల తహసిల్దార్‌కు తపస్ మాగనూర్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వల్లే ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపకుండా, వారికి హక్కుగా ఇవ్వవలసిన డీఏలను విడుదల చేయకపోవడం ఎంతో బాధాకరమన్నారు. గతంలో ఎన్నాడు లేని విధంగా పీఆర్సీ ప్రకటించకుండా కమిటీల పేరుతో కాలాయపైన చేయడం ఎంతో విడ్డూరమన్నారు. ప్రభుత్వాలు ఇలాగే ఉపాధ్యాయుల ఆవేదనలను అర్థం చేసుకోకుండా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధమవుతామని హెచ్చరించారు. అలాగే తపస్ మాగనూర్ మండల అధ్యక్షులు బాబుల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పెండింగ్ డీఏలను వెంబడే విడుదల చేయాలని, వివిధ రకాలుగా పేరుకుపోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు రామ్మోహన్, వెంకటరాములు, రాఘవేంద్ర, జమ్మన్న కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యాలయంలో సమావేశం



నారాయణపేట : వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోణంగేరీ హనుమంతు ఆధ్వర్యంలో సోమవారం నూతన కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ముందుగా డైరెక్టర్లు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి వ్యవసాయ అగ్రికల్చర్ కమిటీ లో అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డ్ కు సంబంధించిన అభివృద్ధి పనుల గురించి, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు సహకారాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, కమిటీ సభ్యులు, మార్కెట్ యార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకులుకు పే స్కేల్ అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ - నారాయణపేట

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు విన్నవించిన క్షేత్ర సహాయకులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు పే స్కేల్ అమలు చేయాలని కోరుతు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులు సోమవారం సీఐటీయూ జిల్లా నాయకులు మహమ్మద్ ఆలీ, నరహరి అధ్వర్యంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. క్షేత్ర సహాయకులకు నష్టం కల్గించే సర్క్యులర్ 4779 ను రద్దు చేయలని, కనీసవేతనం 26 వేల రూపాయాలు ఇవ్వాలని, కలెక్టరు ను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల క్షేత్ర సహాయకులు శేఖర్, కేశవులు, మాణిక్యప్ప, కృష్ణ, దేశ్యబయక్, బాలకృష్ణ, బాలప్పతో పాటు 50 మంది క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలలో రైతులు వరిధాన్యం విక్రయించాలి : కలెక్టర్



నవ తెలంగాణ - నారాయణపేట

రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ వీసీ హాలులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు సివిల్ సప్లై మార్కె టింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఐకెపి 30, పీఏసీఎస్ 67, మెప్మా 2, రైతులు 2 కేంద్రాలు ప్రారంభించాలన్నారు. వరిధాన్యం కేంద్రాలు ప్రారంభించని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సన్న రకం వడ్లకు రూ.500 బోనస్‌గా చెల్లిస్తుందన్నారు. సన్న రకం, దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే 20 లక్షల గన్ని బ్యాగుల సిద్ధంగా ఉన్నాయని ప్రతి కొనుగోలు కేంద్రానికి గన్ని బ్యాగులు సరఫరా చేయాలని ఆదేశించారు. గన్ని బ్యాగులపై కోడ్ నంబర్ రాయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్, ఎస్పీనీ ఏఎంసి చైర్మన్ సన్మానించారు. ఈ సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్, మార్కెట్ చైర్మన్ ఆర్.శివారెడ్డి, వైస్ చైర్మన్ హనుమంతు, మార్కెట్ అధికారులు, డైరెక్టర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకం ఎంతో లాభాదాయకం : కలెక్టర్



నవతెలంగాణ - ఊట్కూర్

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు పొంది ఆర్థిక స్వాలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా ఉట్కూరు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఉట్కూర్‌లో రూ.2 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేసిన పెరటి కోళ్ల పెంపకం మదర్ యూనిట్ ను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ శక్తి కింద వివిధ వ్యాపారాలు చేసుకుని మహిళలు లాభాలు పొందాలని సూచించారు. పెరటి కోళ్ల పెంపకానికి ఎన్ని కోడిపిల్లలను తెచ్చారని, ఎన్ని వారాల పాటు వాటి పోషణ, సంరక్షణ చేస్తారని సమాఖ్య సభ్యులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ మొగులప్ప, అడిషనల్ డీఆర్‌డీఏ అంజయ్య, తహసిల్దార్ చింతారవి, ఎంపీడీవో ధనుంజయ గౌడ్ ఐకెపి వెలుగు శాఖ ఏపిఎం నిర్మల, స్థానిక మాజీ సర్పంచ్ సూర్య ప్రకాష్ రెడ్డి, గ్రామైక్య సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, కొక్కు శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ - ఊట్కూర్

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని తపస్ రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా సోమవారం తపస్ ఊట్కూర్ శాఖ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వివిధ డిమాండ్ల కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షులు కృష్ణ తపస్ జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ లో ఉన్న మూడు డీఏలు, పీఆర్సీలను వెంటనే ప్రకటిస్తామని చెప్పడం జరిగిందని కానీ, అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో కేవలం 1 మాత్రమే కంటితడుపుగా ప్రకటించడం చాలా శోచనీయమని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని చెప్పినటువంటి ప్రభుత్వం ఇప్పటివరకు ఆదిశగా ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం చాలా విడురంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ జీవిత కాలంలో దాదాపు 30 సంవత్సరాలు సర్వీస్ చేస్తూ భవిష్యత్తులో తమ పిల్లల పెళ్ళిళ్ళు చేయాలనో ఇల్లు కట్టుకోవాలనో ఎన్నో ఆశలతో జమ చేసుకున్నటువంటి జీపీఎఫ్ వంటి అమౌంట్ కూడా ప్రభుత్వము రిటైర్ అయిన వెంటనే చెల్లించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉద్యోగులు సరెండర్ లీవ్‌లు సబ్మిట్ చేసి సంవత్సరాలు గడుస్తున్న వాళ్ళ అకౌంట్‌లో డబ్బులు జమ కాకపోవడం లాంటి పరిస్థితులు రాష్ట్రంలో చూస్తున్నామని పేర్కొన్నారు. 317 జీవోతో ఎందరో ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని, అలాంటి వారిని వెంటనే సొంత జిల్లాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే కాలంలో జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ల ముందు ధర్నా, నవంబర్ 23న ఇందిరాపార్క్ వద్ద ధర్నాను విజయవంతం చేయడానికి అధిక సంఖ్యలో ఉపాధ్యా యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ , సంఘ నాయకులు మురళీధర్, రాములు, విజయలక్ష్మి, నాగేందర్ లోమ్టే, పారి జాత,వెంకట్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, పృథ్వీ రాజ్,కిరణ్, కృష్ణ, నర్సిములు, రమాదేవి, అనిత , వసుంధర, పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం : సిఐ



నవతెలంగాణ - నారాయణపేట

ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నారాయణపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసుల విధులు, పోలీసుల ద్వారా వినియోగించ బడుతున్న వివిధ రకాలైన ఆయుధాలు, వాటి మందు గుండు సామాగ్రి, ఆయుధాల పనితీరు, వాటి తయారీ, ఆయుధాలను తయారుచేసిన సంస్థ, దేశాల పేర్లను విద్యార్థులకు సిఐ శివ శంకర్, అర్మడు రిజర్వు పోలీసులు సోమవారం వివరించారు. సాయుధ దళంలో పనిచేసే బాంబు స్కాడ్ బృందం, వివిపిల సందర్శన సమయంలో, రోడ్డుకు ఇరువైపులా ప్రయాణించే దారి, కల్వర్టులు, హెలికాప్టర్ నిలుపు ప్రదేశాలు, బాంబులు తనిఖీ చేయడం, వినియోగించే పరికరాలు డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్, నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్, ఓకే డిటెక్టర్ లాంటి వాటి పని విధానాలను వివరించారు. డాగ్ స్క్వాడ్ బృందం చే జాగిలాలు, వాటి పనితనం, చేసే విధులు మాదక ద్రవ్యాలను కనుగొనడంలో, బాంబులను మందు గుండు సామాగ్రి జల్లటం స్టిక్స్ లాంటి వాటిని కనుగొనడంలో, కీలకంగా నేర స్థలం నందు నేరస్తులను వాసన పసిగట్టి కనుగొనే విధానాన్ని, పోలీసు జాగిలాల నైపుణ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న వివిధ రకాలైన పద్ధతులను తెలియజేసి తల్లిదండ్రులకు బంధువులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి కళాశాల,పాఠశాలల నందు యాంటీ ర్యాగింగ్ కమిటీలు, యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని, విద్యార్థులు మాదక ద్రవ్యాలను వినియోగించకుండా వాటి వల్ల జరుగు అనర్థాలు భవిష్యత్తును నాశనం చేసుకునే అంశాలపై విద్యార్థులకు సిఐ శివ శంకర్ వివరించారు. ర్యాగింగ్ పై కళాశాలల యాజమాన్యాల పర్యవేక్షణ తప్పకుండా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో ధన, ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా త్వరితగతిన స్పందించి జిల్లాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా పోలీసులను మిత్రులుగా భావించి వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్మడ్ రిజర్వు పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోర్డర్ చెక్ పోస్ట్‌ల ఏర్పాటు : ఎస్పీ



నవతెలంగాణ - నారాయణపేట / ఊట్కూర్

రాబోయే ఖరీఫ్ కొనుగోళ్లలో పోరుగు రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రానికి వరి ధాన్యం రాకపోకలను నివారించేందుకు నారాయణపేట జిల్లా పరిధిలో 6 బోర్డర్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ యోగేష్ గౌతమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలాల్‌పూర్ చెక్ పోస్ట్, నారాయణపేట, కాను కుర్తి చెక్ పోస్ట్, దామరగిద్ద, చేగుంట చెక్ పోస్ట్, కృష్ణ, కృష్ణ బ్రిడ్జి చెక్ పోస్ట్, కృష్ణ , సమస్తాపూర్ చెక్ పోస్ట్, ఉట్కూర్, ఉజ్జెలి చెక్ పోస్ట్, మాగనూరు. ఈ బోర్డర్ చెక్‌పోస్ట్‌లలో పోలీస్ అధికారులతో పాటు,రెవెన్యూ అధికారులు ఉండి పూర్తి స్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.కర్ణాటక రాష్ట్రం నుండి వరి ధాన్యం రాకుండా చూడాలని, వాహనాలవే బిల్లులను తనిఖీ చేయాలని సూచించారు.ఎలాంటి అనుమతి లేకుండా ఉంటే చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెక్ పోస్టు దగ్గర వచ్చి పోయే ప్రతి ఒక్క వాహనాల నంబర్లను రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. వ్యాపారస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, చెక్ పోస్టుల వద్దనే కాకుండా బోర్డర్ గ్రామాల నుండి జిల్లాలోకి రాకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, పోలీస్ స్టేషన్లో ఉన్న ఎస్ హెచ్ ఓ లు నిరంతరం చెక్ పోస్ట్ పై నిఘా ఉంచాలని చెక్ పోస్ట్‌ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు రెవెన్యూ అధికారులను నిరంతరం తనిఖీ చేస్తూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని తెలిపారు.

కాంగ్రెస్ మెనీ పెస్టో ప్రకారం .. పింఛన్ డబ్బులను పెంచాలి

- వికలాంగుల హక్కుల పోరాట సమితి

జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఖాన్



నవ తెలంగాణ - ఊట్కూర్

ఆసరా పింఛన్ లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ తన మినీ పోస్ట్ లో పెట్టిన అంశాలను ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్న పింఛన్లు పెంచుతామని చెప్పిన మాట పై పెంచకుండా కళాక్షేపం చేస్తున్నారనినారాయణపేట వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఖాన్ అన్నారు సోమవారం ఆయన నవ తెలంగాణతో మాట్లాడుతూ ఈనెల 30 తేదీన జడ్చర్ల లో ని చంద్ర ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు మహబూబ్ నగర ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు కావున వికలాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు ప్రభుత్వం దివంగులకు 6000 ఇతర వృద్ధులకు ఇతర పెన్షన్ దారులకు 4000 రూపాయలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి ఆయన కోరారు సమావేశంలో కార్యాచరణ పాటించి విషయంపై చర్చించి అమలు చేయడం జరుగుతుందన్నారు

నూతన పీఆర్సీని ప్రకటించాలి : తపస్

నారాయణపేట : పెండింగ్లో ఉన్న డిఏలను వెంటనే ప్రకటించాలని, ఈ కుబేర్లో పెండింగ్లో ఉన్న బిల్లు లని వెంటనే విడుదల చేయాలని, నూతన పిఆర్సిని వెంబడే ప్రకటించాలని కోరుతూ తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మండల తహసిల్దార్ కు తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తపాస్ మండల అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాథ్ రెడ్డి, చిన్న నరసింహులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపకుండా వారికి హక్కుగా ఇవ్వవలసిన డిఏ లను విడుదల చేయకపోవడం ఎంతో బాధాకరమన్నారు.ప్రభుత్వాలు ఇలాగే ఉపాధ్యాయుల ఆవేదన లను అర్థం చేసుకోకుండా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యమాలకైన సిద్ధ మవుతామని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పెండింగ్ డీఏ లను వెంబడే విడుదల చేయాలని, వివిధ రకాలుగా పేరుకుపోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, మండల నాయకులు రవికుమార్, లక్ష్మణ్, శ్యామ్, అశోక్ రెడ్డి,లాలప్ప, వెంకటేష్, రాజేష్, కేశవ్, రామేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ల ఆవిష్కరణ



నవతెలంగాణ - నారాయణపేట

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మండల రిసోర్స్ సెంటర్ లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా టాస్ కో ఆర్డినేటర్ శివయ్య ముఖ్యఅతిథిగా హాజరై జిల్లాలోని ఏ వన్ సెంటర్ కో ఆర్డినేటర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని బయట ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించి అడ్మిషన్స్ తీసుకోవాలని అన్నారు. అందరూ ఏమని కో ఆర్డినేటర్లు అందుబాటులో ఉండి బయట ఉన్న విద్యార్థుల యొక్క సమస్యలపై అవగాహన కల్పించాలని, ఏవైనా సమస్యలు ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఆధ్వర్య ంలో ఉమ్మడి జిల్లా టాస్ కో ఆర్డినేటర్ శివయ్య ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సూపరిం టెండెంట్ నరసింహారెడ్డి, నారాయణపేట టాస్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ నాగార్జున రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, జిల్లాలోని ఏ వన్ కో ఆర్డినేటర్లు చెన్నారెడ్డి, జగదీష్, శంభులింగం, ఓం ప్రకాష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

టాస్ ఓపెన్ ఇంటర్ వాల్ పోస్టర్‌ల విడుదల

జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి కో-ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మరియు లెక్చరర్స్ %ఉూరా% ఓపెన్ ఇంటర్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి గోడ పత్రికను సోమవారం విడుదల చేశారు. %శాక్మీ% కోఆర్డినేటర్ మాట్లాడుతూ సార్వత్రిక మరియు దూర విద్య విధానం ద్వారా ఇంటర్మీడియట్ చదవడం కోసం అడ్మిషన్లు స్వీకరించబడుచున్నవని, చదువు పైన ఆసక్తి ఉండి ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇది మంచి అవకాశం. ఓపెన్ ఇంటర్ అప్లై చేయడానికి చివరి తేదీ 31-10-2024 వరకు అవకాశం ఉంది. శ్రీ సాయి కో ఆఫ్ జూనియర్ కాలేజ్, మిగతా వివరాల కోసం 9908069789,9441906514 నంబర్ ను సంప్రదించగలరు.

పంటలకు మద్దతు ధరతో బోనస్ ఇవ్వాలి : ఏఐపీకేఎస్



నవ తెలంగాణ - నారాయణపేట

అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నారాయణపేట జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్లో జిల్లా అధ్యక్షుడు భగవ%శీ%త్తు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాము హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతు డిక్లరేషన్ పేరుతో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారంగా అన్ని పంటలకు బోనస్ ఇస్తూ ప్రతి పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఖరీఫ్, రబి రెండు సీజన్లకు కలిపి వెంటనే రైతు ఖాతాలలో 15 వేల రూపాయలు జమ చేయాలని, పెండింగ్ లో ఉన్న రైతు రుణమాఫీ చేయాలని,అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కమిటీ అక్టోబర్ 25 నుండి నవంబర్ 5 వరకు మండల డివిజన్ జిల్లా కార్యాలయం ముందు ధర్నాలు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసుకొనుటకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వరి సన్న రకాలకు మాత్రమే బోనస్ ప్రకటించడం సరికాదు.మిగతా పంటలు పండించే రైతులంతా తెలంగాణ రైతులు కారా? వారు పండించే పంటలు ధాన్యం కాదా? వారు ఏమి పాపం చేశారని అన్నారు. జిల్లాలో వెంటనే పత్తి, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను దళారి వ్యాపారాస్తుల దోపిడీ నుండి రక్షించాలన్నారు. పత్తి పంట తేమశాతం 10 నుండి 15 వరకు ఉన్న మద్దతు ధరకు కొనుగోలు చేయలన్నారు. అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు దిగుబడి సగానికి పడిపోయి తీవ్రమైన నష్టంలో ఉన్నారన్నారు. పత్తి 12 శాతానికంటే ఎక్కువ ఉంటే ఒక్కో శాతానికి 75 రూపాయల ధర తగ్గించడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు డిక్లరేషన్ లో భాగంగా ప్రకటించిన మద్దతు ధరలకు కొనుగోలు చేస్తూ ప్రతి పంటకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలన్నారు.లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఈ కార్య క్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, చెన్నారెడ్డి సహాయ కార్యదర్శి కొండ నర్సింలు, బాలకృష్ణ ,నారాయణ, బాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి : ట్రైనీ కలెక్టర్

నవతెలంగాణ - నారాయణపేట

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ట్రైని కలెక్టర్ గరిమా నరుల అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన 25 ఫిర్యాదులను ట్రైనీ కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను ట్రైని కలెక్టర్ కు విన్నవించారు. వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ట్రైని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో మధుమోహన్, ఏవో, వివిధ శాఖల అధికారులు, ఫిర్యాదు దారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

5

జోగులాంబ గద్వాల

మంగళవారం | అక్టోబర్ 29, 2024 | www.navatelangana.com



' పశుగణన 'వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

పశు సంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన పశుగణన వాల్‌పోస్టర్లను కలెక్టర్ బీ ఎం సంతోష్ సోమవారం ఐ.డీ. ఓ.సీ సమావేశం హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన తెలంగాణ సర్వే కార్యక్రమం జిల్లాలో ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందని అన్నారు. ఈ ప్రక్రియలో ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్ళు, మేకలు, తదితర వాటి సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో మొబైల్ అనువర్తనం ద్వారా నిక్షిప్తంగా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 12 మండలాలకు గాను ఒక నోడల్ ఆఫీసర్,12 మంది సూపర్‌వైజర్లు, 44 మంది ఎన్యుమేరేటర్లు కలిసి జిల్లాలోని ప్రతి నివాస గృహాన్ని సందర్శించి పశుగణ న వివరాలు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వివరాల సేకరణలో ప్రజా ప్రతి నిధులు, పాడి రైతులు, పశు పోషకులు, గొర్లకాపర్లు ప్రతి ఒక్కరూ సహకరించి సమాచారాన్ని అందించాలన్నారు. పశుగణన వివరాల ద్వారా మాంసం గుడ్లు, పాల ఉత్పతులు గుణించి పశు సమవర్ధక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు చేసుకోడానికి తోడ్పడుతుందన్నారు. తద్వారా భారత దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) పెంచడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్ డీ ఓ రామచందర్, పశు సంవర్ధక శాఖఅధికారి వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి షకీలా భాను, ఆర్‌డబ్ల్యూఎస్ ఏ.ఈశ్రీధర్‌రెడ్డి, వైద్యులు, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరించిన కలెక్టర్



వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్లను సోమవారం ఐ.డీ.ఓ.సీ సమావేశం హాల్‌లో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్ రావు, జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా పోస్టర్స్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, బస్తీ దవకానాలకు, సబ్ సెంటర్లకు, జిల్లా ఆస్పత్రికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పోస్టర్ల ద్వారా ప్రజలకు నీళ్ల విరోచనాల వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లను అన్ని తరగతుల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రైమరీ స్కూల్స్ కి, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ కి,హైస్కూల్స్ కి, విద్యాశాఖ ద్వారా పంపిస్తున్నామని, ఈ పోస్టర్స్‌లను ఉపాధ్యాయులు తీసుకొని విద్యార్థులకు రక్తహీనత (ఎనీ మియా) రాకుండా ఎలా నివారించుకోవాలో అనే విషయంపై అవగాహన కల్పించాలని అన్నారు.అదేవిధంగా విద్యార్థులు తీసుకోవాల్సిన పోష్టహారం, మంచి అలవాట్లపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, బస్తీ దవఖానాలకు అర్బన్ సెంటర్లకు సబ్ సెంటర్లకు అంగన్వాడీ సెంటర్లకు సరఫరా చేస్తున్నా మని అన్నారు. ఈ పోస్టర్స్ ద్వారా వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది విద్యా ర్థులు, ప్రజలు పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వయసు ప్రకారం, డోస్ ప్రకారం ఎలా వేసుకోవాలో అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.సిద్ధప్ప, ఆర్.డీ.ఓ. రామచందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారిణి సుధారాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలి

- అఖిలపక్ష నాయకులు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం, బిజ్వారం గ్రామం వడ్డె రాజేశ్వర్ మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డితో పాటు మల్దకల్ ఎస్సై కూడా బాధ్యుడే అని అఖిలపక్ష కమిటీ ఆరోపించారు. మృతురాలు కుటుంబాన్ని పరామర్శించిన జోగులాంబ గద్వాల జిల్లా అఖిలపక్ష కమిటీ నిజనిర్ధారణలో చాలా దారుణమైన విషయాలు విలువలోకి వచ్చాయని బాలిక చనిపోయిన రోజు డీసీఎం నిండా వచ్చిన పోలీసులు రాత్రంతా జాగరణ చేసి అత్యంత పకడ్బందీగా అంతక్రియలు పూర్తి చేశారని పేర్కొన్నారు. నిజనిర్ధారణకు అఖిల పక్ష కమిటీ వస్తుందని తెలిసి సోమవారం మృతురాలు తల్లిని, బంధువులను మాయం చేశారన్నారు. బండ్ల రాజశేఖర్‌రెడ్డి మౌఖిక ఫిర్యాదుతోనే పోలీసుల విచారణ సందర్భంగా పెద్దమ్మను కూడా దగ్గరకు రానీయకుండా ఉదయం నుంచి సాయంకాలం వరకు పోలీస్ స్టేషన్‌లోనే విచారణ సాగిందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ సంఘటనకు తీవ్ర మనస్థాపానికి గురై మరుసటి రోజు ఆమె పురుగుల మందు తాగి సస్తానని పెద్దమ్మతో వాపోయిందని తెలిపారు. ఈ నెల 11న పోలీస్ విచారణ అనంతరం దసరా పండుగ రోజు ఉదయమే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన దారుణ సంఘటన చోటుచేసుకుందన్నారు. మళ్లీ కర్నూలు ప్రవేట్ ఆసుపత్రికి వెళ్లిన పోలీసుల బెదిరింపులతో కోలుకుంటున్న బాలిక భయంతోనే మరణించిందని అనుమానం వ్యక్తం చేశారు. దొంగతనం నేరం బాల కార్మికురాలిపై మోపడం ఎంత నేరమో బాల కార్మికురాలను పనిలో పెట్టుకోవడం పెద్ద నేరం అయినా ఇంతవరకు పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి డబ్బుకు లొంగిపోవడం లాంటి అత్యంత జుగుప్సాకరమైన అంశాలు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉన్నాయని, శవాన్ని ఖననం చేయడానికి పోలీసుల ఉత్సాహం నిందితుని అరెస్టు చేయడానికి చూపకపోవడం వెనక ధన బలం, అధికార బలం కనబడుతున్నాయని నిజనిర్ధానలో తేలిందన్నారు. ఈ మొత్తం వ్యవహారం బయటకు రాకుండా ఉండటానికి ఈ రోజు ఉదయం తల్లిని మాయం చేశారని, బంధువులను ఎక్కడ బంధించారో అన్న అనుమానం పలువురు వ్యక్తం చేశారన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేశారు. నిందితునిడిని వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.మల్దకల్ పోలీసుల పరిధిలోకి ఈ కేసు రాకుండా అతి చొరవ తీసుకొని బాలిక మరణానికి కారణమైన మల్దకల్ ఎస్సై పై చట్టం, న్యాయపరమైన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు జ్యోతి, ప్రజా సంఘాలు నాయకులు గోపాల్, ప్రభాకర్, వినోద్, కిష్టన్న, రవి కుమార్ అఖిలపక్ష కమిటీ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు , వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్పీ టీ శ్రీనివాసరావు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజల సమస్యలను చట్టపరంగా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ టీ శ్రీనివాస రావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాల యంలో ఎస్పీ బాధితుల నుంచి 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను వినివాటిని చట్టప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరి ంచాల్సిందిగా సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది బాధితుల నుంచి అర్జీలను సంబంధిత డీఎస్పి, సర్కిల్ అధికారుల సమక్షంలో స్వీకరించడం జరిగిందనీ, వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబ ంధిత స్టేషన్ల ఎస్‌ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే కుటుంబంలో వృద్ధులను చూసు కోవాల్సిన బాధ్యత కన్న వారి పై ఉంటు ందని, వారి సంరక్షణ గురించి వృద్ధులు పోలీస్ అధికారుల దగ్గరకు రావడం బాధాకరమైన విషయమని అన్నారు, అలాంటి వారికి, కుటుంబ తగాదాలకు పాల్పడే వారికి కౌన్సెలింగ్ ఇవ్వా ల్సిందిగా అధికారులను ఎస్పీ ఆదేశించారు. సోమవారం వచ్చిన ఫిర్యాదులలో భూ వివాదాలకు సంబంధించి 4 ఫిర్యాదులు, గొడవలకు సంబంధించి 2, కుటుంబ తగాదాలకు సంబంధించి 2, ఇతర అంశాలకు సంబంధించి 3 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

సత్వరమే దరఖాస్తులను పరిష్కరించాలి : కలెక్టర్



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (35) ఫిర్యా దులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీఓ రామచందర్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమ ర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

అలంపూర్ పట్టణంలోని సంత మార్కెట్ కాలనీ దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమదాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ(ఎం) , ఎమ్మార్పీఎస్ టీఎస్ సంఘాల ఆధ్వర్యంలో అలంపూర్ సంత మార్కెట్ కాలనీ దళితులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009 అక్టోబర్ 2న వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన వరద బాధితులకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని , కానీ సంతమార్కెట్ కాలనీ దళితులకు ఇండ్ల స్థలాలు ఎవరికి ఇవ్వలేదని అన్నారు. 150 దళిత కుటుంబాలు ఉన్నాయని , ఒక్కరికీ కూడా ఇంటి జాగా ఇవ్వలేదని అన్నారు. వరద బాధితులకు ఇండ్లస్థలాల కోసం ప్రభుత్వం 43 ఎకరాలు కొనుగోలు చేసి పట్టాలు పంపిణీ చేసిందని, గ్రామంలో ఉన్న అన్ని కులాల వారికి పట్టాలు ఇచ్చి సంత మార్కెట్ కాలనీ దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం దళితుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శన మని అన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేక ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయి ఇండ్లలో.. పూరి గుడిసెలలో మట్టి మిద్దెలలో నివసిస్తున్న పాలకులు పట్టించుకోవడంలేదని విమర్శి ంచారు . గత 15 ఏళ్లుగా ఇండ్ల స్థలాల కోసం అధికా రుల, పాలకుల చుట్టూ తిరుగుతున్న ఇళ్లస్థలాలు కేటాయించడం లేదని వాపోయారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాల దగ్గర దళితులకు ఇండ్లు కేటాయించాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న స్థలాలు చూయించలేదని, ఇళ్ల స్థలాల కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన వ్యక్తిగత దరఖాస్తులు పెట్టిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయి ంచాలని, లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జీ. రాజు , రేపల్లె దేవదాసు, దళితులు జయన్న ,అబ్రహం,దావీదు, బాలు తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరి మృతికి కారకులైన వారిపె చర్యలు తీసుకోవాలి : ఐద్వా



నవతెలంగాణ - గట్టు

బీసీ సామాజిక వర్గానికీ చెందిన నిరుపేద మైనర్ బాలిక రాజేశ్వరి(13) మృతికి కారణమైన వ్యక్తులనువెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం 7గంటల ప్రాంతంలో ర్యాలీ, నిరసన చేసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడుతూ మూడు రోజుల క్రితం మల్దకల్ మండలం, బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలిక రాజేశ్వరినీ సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్ రెడ్డి ఇంటిలో పనిమనిషిగా మైనర్ బాలికను పెట్టుకోవడం నేరం ఆపై అక్రమ కేసు దొంగతనం మోపి అక్రమ కేసు బంగారు దొంగతనం చేసిందని పోలీస్ స్టేషన్‌కి పిలిపియడంతో పోలీసులకు భయపడి మా అమ్మను ఏం చేస్తారన్న ఒక భయా నికి గురై రాజేశ్వరి నేను దొంగతనం చేయలేదని తల్లి ముందు నిజాం ఒప్పుకున్న ఒప్పించే ప్రయత్నం చేయడం వల్ల చేయని నేరానికి అవమానానికి ఆత్మ అభిమానాన్ని చంపుకొని పురుగుల మందు తాగిన బాలిక ఆత్మయత్నానికి ప్రయత్నం చేసిందన్నారు. తల్లి వెంటనే గద్వాల ఆసుపత్రికి తీసుకువెళితే అక్కడ సీరియస్ గా ఉన్నదని చెప్పడం వల్ల కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ వారి నిరుపేద కుటుంబం ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో మళ్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అక్కడ కొన్ని రోజుల పాటు చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం కుటుంబానికి ఈ సమాజానికి దూరమైన బాలిక మృతికి కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్ని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీ.వీ నర్సింహా మాట్లాడుతూ గద్వాలలో అగ్రవర్ణ కులానికి చెందిన వ్యక్తి ఇంట్లో మైనర్ బాలికను పనిలో పెట్టుకొని అక్రమ దొంగతనం నేరం మోపబడి మల్దకల్ పోలీస్ స్టేషను లో కేసు పెట్టి రాజేశ్వరినీ వేధింపులకు గురిచేసి మనస్థాపనికి గురై పురుగుల మందు తాగి కర్నూల్ పెద్ద ఆసుపత్రిలో 13 రోజులు ప్రాణంతో పోరాటం చేసి మృతి చెందినట్లు తెలిపారు. బాలిక మృతికి కారణమైన బాధ్యులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గట్టు మండల కేంద్రంలో కొవ్వుతుల ర్యాలీ,రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, కొవ్వొత్తులతో నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జయమ్మ, లక్ష్మి, గోవిందమ్మ , సీ ఐ టీ యూ నాయకులు ఈరన్న, సీపీఐ(ఎం) మండల నాయకులు ఆంజనేయులు, తిమప్ప, బద్రి, నర్సిములు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

- బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ కురువ పుల్లయ్య మాట్లాడుతూ 10 నెలల నుంచి విద్యార్థులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా పోరాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తుండడం సరైంది కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా ర్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయక పోవడం దురదృష్టకరమన్నారు. స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల యాజమాన్యాలు కాలేజీలకు తాళాలు వేసి రోడ్లపై ధర్నా చేసే పరిస్థితికి తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డి సీఎం పద వికి తక్షణమే రాజీనామా చేయాలన్నారు. విద్యార్థులు అనేక ఆర్థిక పరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చే శారు. ఇంటర్, డిగ్రీలు పూర్తిచేసిన విద్యార్థులు వివిధ రకాల ఎంట్రన్స్‌లలో ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో డబ్బులు కట్టి టీ.సీ ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.పేద , మధ్య తరగతి విద్యార్థులు హాస్టల్స్,రెసిడెన్షియాలో పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు, స్కాలర్షిప్లు పెంచకపోవడం పాలకులకు విద్యారంగం పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. హాస్టల్స్‌లలో ఉండి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోట్ చార్జీలు పెంచకపోవడంతో పౌష్టికాహార లోపంతో కూడిన ఆహారం తినలేక విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్స్, రెసిడెన్షియల్స్‌కు సొంత భవనాలు లేక ఇరుకు గదులలో చెప్పుకోలేని అవస్థలు పడుతున్నారన్నారు.రాష్ట్రంలోని గ్రూప్-1 ఉద్యోగాలకు ప్రధాన అడ్డంకిగా మారిన జీవో నెంబర్ 29ని తక్షణమే రద్దు చేసి, జీవో నెంబర్ 55 ప్రకారం నియామకాలు చేపట్టాలని, లేకపోతే అన్ని విద్యార్థి, నిరుద్యోగ యువతను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తక్షణమే రాష్ట్రంలోని మధ్యతరగతి విద్యార్థులు చదివే 1023 గురుకులల పై వివక్ష విడనాడి, మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు ప్రేమలత , బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం నాయకులు మాధవ్, మత్తాలి, ఖజావలి, సోమశేఖర్నాయుడు, నరసింహ, వీరేష్, రాజు, మహేష్ వివిధ కళాశాలలకు చెందిన పీజీ, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

30న ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయండి

- ఎమ్మార్పీఎస్ గట్టు మండల అధ్యక్షుడు బలిగేర ఏసన్న



నవతెలంగాణ - గట్టు

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కమిటీ పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఈ నెల 30 న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో కేంద్రంలో జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ గట్టు మండల అధ్యక్షుడు బలిగేర ఏసన్న మాదిగ కోరారు. సోమవారం గట్టు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలతో తియ్యగా మాట్లాడి, మాదిగల పట్ల ఎంతో ప్రేమ ఉన్నట్లు నటిస్తూ..మాదిగలకు ద్రోహం చేస్తున్నారని అన్నారు. ఆగస్ట్ 1న సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చు అని తీర్పు ఇచ్చిందని, సుప్రీమ్ కోర్టు తీర్పు వచ్చిన అర్థగంటలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే మొట్టమొదటిగా తెలంగా ణలోనే వర్గీకరణ చేస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. తెలంగాణలో ఏ నోటిఫికేషన్ వచ్చిన వర్గీకరణ అమలు ఐతదని ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీలో హామీ ఇచ్చారని, రెండు నెలలు తిరుగక ముందే మాట మార్చిన సీఎం మాదిగలకు ద్రోహం చేశారని విమర్శించారు . దేశంలోనే తెలంగాణ రాష్ట్రం వర్గీకరణలో మొట్టమొదటి రాష్ట్రం ఐతదని మాదిగలు ఎంతో సంతోషించారని అన్నారు.రేవంత్ రెడ్డి చేస్తున్న నమ్మక ద్రోహాన్ని మాదిగ జాతి సహించదని హెచ్చరించారు. విద్యా శాఖ తన పరిధిలోని ఉన్నది ఎస్సీ వర్గీకరణ మీద మాట ఇచ్చి తన శాఖ పరిధిలోనే 11 వేలకు పైగా టీచర్ పోస్టులను ఎస్సీ వర్గీకరణ లేకుండా భర్తీ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పదవి కాపాడుకోవడం కోసం మాదిగలకు అన్యాయం చేయ డం తగదని, ఒక జాతికి న్యాయం చేయ డం కన్నా ముఖ్యమంత్రి పదవీ కాపాడుకోవడమే ఎక్కువా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారి తూమ్ డేవిడ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీని యర్ నాయకులు ముక్కరన్న మాదిగ కుమేష్, మిట్ట దొడ్డి ఇసాక్, సంగటి రాజు, డీ.నరసింహులు, గంగి మాన్ దొడ్డి సంతోష్ గొర్లఖాన్ దొడ్డి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు టీ. నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ముగిసిన ..

ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆల్ ఇండియా సర్వీసెస్ (ఏఐఎస్),సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (సీసీఎస్) 25 మంది శిక్షణాధికారులతో కలెక్టర్ బీ.ఎం. సంతోష్ సమావేశం నిర్వహించారు. గత వారం రోజులుగా జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ ప్రభుత్వ పథకాలు, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలు, ఇతర ప్రభుత్వ విభాగాల తమ పరిశీలన ఫలి తాలను, అనుభవాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను అభినందిస్తూ ఈ అనుభవాలు మీ భవిష్యత్ ఉద్యోగ జీవితంలో ఉపయోగపడతాయని, ప్రజాసేవ కోసం ఇది మంచి శిక్షణగా నిలు స్తుందని అన్నారు. శిక్షణాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ పథకాలు, పురపాలక సంస్థల పని తీరు, పాఠశాలలు, ప్రాథమిక ఆరో గ్య కేంద్రాలు, గద్వాల్ జిల్లాలోని చేనేత పరిశ్రమ, ఆలయాలు, మార్కెటింగ్, ఉపాధి అవకా శాలు, ప్రసాద్ పథకం, మహిళా శక్తి పథకాలు వంటి అంశాలపై తమకు అవగా హన పెరిగిందని అన్నారు.ఈ క్షేత్రస్థాయి సందర్శన ద్వారా స్థానిక సమస్యలు, పథకాల ప్రభావంపై మరింతగా తెలుసుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, జెడ్పీ సీ.ఈ.ఓ కాంతమ్మ, ట్రైనీ ఆల్ ఇండియా సర్వీసెస్ (ఏఐఎస్), సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (సీసీఎస్) అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

- ఉపాధ్యాయులు రాక క్యారం ఆడుతున్న విద్యార్థులు



నవతెలంగాణ - గట్టు

ఉదయం 9:30గంటలైన పాఠశాలకు ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఆటల్లో మునిగిపోయిన సంఘటన గట్టు మండలం లోని చమనా ఖాన్‌దొడ్డి పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. ఉదయం 9.30 గంట లైన ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఆటలలో ముని పోయారు ఈ పాఠశాలలో దాదాపు 70 మంది విద్యార్థులకు పైగా ఉన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించాల్సిన ప్రేయర్ ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యా ర్థులు ఆటల్లో మునిగిపోయారు కానీ ఇలా ఉంటే ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులు ఆడింది ఆట పాడిందే పాటగా మారిందని మండల ప్రజలు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చమన్ దొడ్డి గ్రామంలోని ఉన్న పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతుంది. ఉపాధ్యాయులు మాత్రం సమయం పాలన పాటించకుండా తమ ఇష్టం వచ్చి నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఇందు వాసి గ్రామంలోని ఉన్న దళిత పాఠశాలలో అక్కడ 9 గంటల 45 నిమిషాలు పైన కూడా ఎంబి ఫౌండేషన్ వాలంటరీ మాత్రమే ఉన్నారు. అక్కడ కూడా ప్రేయర్‌కు రాక విద్యార్థులు ఆటల్లో మునిగిపోతున్నారు. పాఠశాల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కానీ ఎంఈఓ కానీ పాఠశాలను వారానికి కనీసం మూడుసార్లు పాఠశాలలుతనిఖీచేస్తేబాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ - గట్టు

తపస్ గట్టు మండల శాఖ ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష నిరసన కార్యక్రమంలో భాగంగా 5 డీ ఏ లు పీఆర్సీ , జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, మెడికల్ బిల్లు, సప్లమెంటరీ బిల్స్ వెంటనే విడుదల చేయాలని తహసీల్దార్ సరిత రాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్రంకి పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ గట్టు మండల అధ్యక్షులు పరశురామ్, తపస్ గట్టు మండల ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, సభ్యులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా చూస్తాం..

- కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇన్‌చార్జీ సరిత

నవతెలంగాణ - మల్దకల్

మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డెర రాజేశ్వరీ ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ హాస్పిటల్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను గద్వాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సరిత పరామర్శించి వారికీ భరోసానిచ్చారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని రాజేశ్వరీ చావుకు కారణం ఏవరైనా శిక్ష పడి మీ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.